క్లుప్తంగా

ఘనంగా సుజాతనగర్ మహిళా మండలి వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న 97వవార్డు కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లోని మహిళా మండలి 28వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ శానాపతి వసంత కేక్ కట్‌చేసి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా హక్కుల గురించి వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు భానుమతి, ఉపాధ్యక్షురాలు గేహర్‌బాషా, సెక్రటరీ హైమావతి, జ్యోతి, అమరావతి, విజయ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



వడ్డన చేస్తున్న అజయ్‌రాజ్ తదితరులు

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు ప్రహ్లాదపురంలోని శ్రీ శారదాపీఠ పరిపాలిత ఉమా మహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



ట్రోఫీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

పరవాడ: వాడచీపురుపల్లి శ్రీ రామచంద్రమ్మ పండగ పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో ఎన్టీపీసీ నుంచి తలపడ్డ 15 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సమీక్ష సాహు, పి.అజేయ్‌కుమార్, ఎం.కుష్వంత్, ఎస్.ఖాతినాథ్‌లు రెండేసి బంగారు పతకాలు సాధించారు. జి.వంశీ, వి.ఉత్తేజ్, పి.వివేక్‌వర్మ, అశ్విన్‌అనీష్, జె.దుర్గారావు బంగారు పతకాలు, అలాగే వి.వర్షిత్, ఎస్.సాయినారాయణ, ఎం.దేవ హర్షిత్‌లు వెండి, రజత పతకాలు సాధించారు. వి.శ్రీనిధి ప్రియ రెండు పతకాలు సాధించగా బి.యశ్వంత్, బి.కాశీనాథ్ సత్తా చాటారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు, కోచ్ గొర్లి పుష్పారావు తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ విశాఖ వ్యాలీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని పరిచయం చేస్తున్న జేసీఐ ఇండియా జోన్ ఫోర్ అధ్యక్షుడు జె.ఎస్.ఎన్.వర్మ

మద్దిలపాలెం: యువత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జేసీఐ ఇండియా జోన్ ఫోర్ అధ్యక్షుడు జె.ఎస్.ఎన్.వర్మ అన్నారు. జేసీఐ విశాఖ వ్యాలీ 38వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం స్థానిక ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. 38వ జేసీఐ విశాఖ వ్యాలీ నూతన అధ్యక్షుడిగా సంఘ మిత్ర మీడియా అధినేత అమరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ యువతను అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో అభియాన్ పేరిట 10 వేల మందికి ఈ ఏడాది స్కిల్ డెవెలప్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ మాజీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కె.వి.రావు, జోన్ ఫ్లోర్ వైస్ ప్రెసిడెంట్ రామ్, సూర్య, డైరెక్టర్లు సురేష్, దేవానంద్ పాల్గొన్నారు.

శ్రీరామచంద్రమ్మ పండగకు వేళాయె

- వేకువ జాము నుంచే దర్శనాలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ



విశేష అలంకరణలో శ్రీరామచంద్రమ్మ


పరవాడ: వాడచీపురుపల్లిలో కొలువుదీరిన రామచంద్రమ్మ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సన్నద్ధమైంది. మంగళవారం వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలిరానున్నారు. ఆ మేరకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. 14 గ్రామాల ప్రజలు అమ్మవారి పండగ చేసుకుంటారు. దళాయిపాలెం సమీపంలోని శ్రీ రామచంద్రమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. ముఖద్వారాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. వాడచీపురుపల్లి, సంతబయలులో ఏర్పాటు చేసిన రెండు భారీ సెట్టింగ్‌లు చూపరులను ఆకర్షిస్తున్నాయి. మెయిన్‌రోడ్డు, పుర వీధులను రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అలంకరించారు. వాడచీపురుపల్లిలో అమ్మవారి సంతకం పట్టు వద్ద అమ్మవారి రథోత్సవాన్ని అంగ రంగ వైభవంగా నిర్వహించిన అనంతరం రాత్రికి భారీ బాణ సంచా కాల్పుల మధ్య అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు చెప్పారు. పండగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు.



పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన ముఖద్వారం



వాడచీపురుపల్లిలో వేసిన అమ్మవారి భారీ సెట్టింగ్



సంతబయలులో వేసిన భారీ సెట్టింగ్

గ్రావెల్ దందా!

- ఇష్టానుసారంగా తవ్వకాలు
- ప్రమాదం అని తెలిసినా బరితెగింపు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయిన్



గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్

సబ్బవరం: మండలంలోని అమృతపురం పరిసర ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అమృతపురం శివారు చింతగట్ల అగ్రహారం రెవెన్యూ పరిధిలో సోమవారం పట్టపగలు పొక్లెయిన్ సాయంతో మూడు ట్రాక్టర్లతో దర్జాగా గ్రావెల్ తరలించారు. జగనన్న కాలనీ సమీపంలోని సర్వే నెంబర్ 39లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు చేపట్టారు. అయితే స్థానికులు మీడియాకు సమాచారం అందించారు. అక్కడకు వెళ్లి మీడియా ప్రతినిధులు వివరణ కోరితే జగనన్న కాలనీకి గ్రావెల్ తరలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలకు గ్రావెల్ అవసరం లేదన్నారు. కాలనీకి ఆనుకుని జరుగుతున్న మరో బిల్డింగ్ నిర్మాణంతో పాటు పలు చోట్లకు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నట్లు చెప్పారు. తవ్వకాలు చేపట్టిన ప్రదేశంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా పట్టించుకోలేదన్నారు. మైనింగ్,రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికం

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అలాగే స్వామికి సహస్రనామార్చన పూజ ఘనంగా నిర్వహించారు.

అభిషేకాలు.. అర్చనలు



ఉమారామలింగేశ్వర స్వామి



పూజల్లో పాల్గొన్న భక్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు సింహపురి కాలనీలోని సీతారామాలయ ఉపాలయాల వార్షికోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 19 వతేదీ వరకు జరిగే శ్రీ సిద్ధివినాయక, షిర్డీ సాయి బాబా, గాయత్రీ దేవి సహిత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాల వార్షికోత్సాలు నిర్వహించనున్నారు. ఉదయం వరసిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకం చేశారు. పరమేశ్వరుడి చెంత సామూహిక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీఆర్ మూర్తి, చలపతిరావు, అప్పలనాయుడు, రామారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. హర నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కార్మికులకు చిత్తశుద్ధితో వైద్యం అందించండి

ఈఎస్ఐ కేంద్రబోర్డు సభ్యుడు కేవీ శేఖర్‌రాజు

సింథియా: కార్మికులకు చిత్తశుద్ధితో సేవలందించాలని ఈఎస్ఐ సిబ్బందికి ఈఎస్ఐ కేంద్ర బోర్డు మెంబర్ కేవీ శేఖర్‌రాజు సూచించారు.
జీవీఎంసీ 40వ వార్డులోని ఈఎస్ఐసీ ఆస్పత్రి ఆవరణలో జనరల్ పర్పస్ మెడికల్ కేర్ సబ్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో శేఖర్‌రాజుతో పాటు భారతీయ మజ్దూర్ సంఘం అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్, మండల కార్యదర్శి నరేంద్ర, శ్రీకాకుళం జిల్లా నుంచి అప్పయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ పరవాడలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి అద్దె సకాలంలో చెల్లించాలన్నారు. కార్మికుల నుంచి డబ్బులు కట్టించుకుని వృథా చేయడం సరికాదన్నారు. కార్మికులకు సరైన వైద్య సదుపాయాలు అందిచడంలేదని, మెడికల్ టెస్టులు చేయడం లేదని, కేజీహెచ్‌కు రిఫర్ చేయమంటే విజయనగరం పంపడం సరికాదన్నారు. షీలానగర్‌లో 400 పడకల ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అచ్యుతాపురంలో 100 పడకల ఆస్పత్రి పనులు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఈఎస్ఐ అధికారులు పాల్గొన్నారు.

'ఇళ్లు తొలగించవద్దని వినతి'

మహారాణిపేట: సింహాచలం దేవస్థానం భూముల పరిరక్షణలో భాగంగా రక్షణ గోడ నిర్మాణం కోసం తమ ఇళ్లు తొలగిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఎప్పటి నుంచో ఇంటి పన్ను కడుతున్నామని,అలాగే కరెంటు బిల్లు కూడా చెల్లిస్తున్నామని ఇప్పుడు తమ ఇళ్లు తొలగించడం అన్యాయమని నల్లఅప్పారావు,సేనాపతి వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు.తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు



అయ్యన్నపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న మంటలు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధిలోని భూదేవి చెరువును ఆనుకుని ఉన్న నల్లకొండ అటవీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఇవి వ్యాపించడంతో సమీపంలోని సుమారు 4 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఆకేషియా తోటతో పాటు జీడి, జీడి మామిడి తోటలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఉపసర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు గ్రామస్తులతో కలిసి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలు మరింత వ్యాపిస్తుండడంతో సబ్బవరంఅగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి గ్రామస్తులు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపుచేసినట్లు తెలిపారు. అయితే చిన్నచిన్న మంటలు ఇంకా రావడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. మంటలు ఎలా వచ్చాయన్నది తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు.

యర్రవానిపాలెం వాసుల నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి శివారు యర్రవానిపాలెంలో గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా షెడ్లు తొలగించిన వారికి న్యాయం చేయాలని ఎంపీటీసీ కర్రి అప్పారావు, సర్పంచ్ కర్రి నరసింగరావు కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సుమారు 100 మంది వరకూ గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ సత్యనారాయణకు వినతి ప్రతం అందజేశారు. పూర్వీకుల నుంచి ఉంటున్న స్థలంలో వేసుకున్న షెడ్లు తొలగించడానికి వీఆర్వో తదితరులు పొక్లెయిన్‌తో రాగా మాట్లాడానికి వచ్చిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టారని చెప్పారు. వినతిపత్రంలో తెలియజేసిన విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి. లక్ష్మి,పల్ల వరలక్ష్మి,దూళి అప్పల నరసమ్మ,పంచదార్ల కృష్ణవేణి, కాయితి దేవుడమ్మ తదితరులు ఉన్నారు.

'విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వం'



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే అతిపెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. మహనీయుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 732వ రోజు, సోమవారం ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. ఏళ్లు గడుస్తున్నా, ఉక్కు ఉద్యమాన్ని కొనసాగించడం కార్మికుల పోరాట పటిమకు నిదర్శనమని కొనియాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చెయొద్దని స్పష్టమైన వైఖరి తెలిపిన తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు సైతం వారి రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరసాల బాలకృష్ణ, మధు, శ్రీనుప్రకాష్, నాగేశ్వరరావు, ప్రదీప్, సత్యనారాయణ, కృష్ణంరాజు, పాత్రో, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శిష్ట కరణ సంఘం నాయకులకు సత్కారం



నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక: గాజువాక శిష్ట కరణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు, ప్రతినిధి మణిపాత్రుని సత్యనారాయణను అఖిల భారత శిష్ట కరణ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆ సంఘం డెలిగేట్స్ మీటింగ్‌లో వారిని సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. గాజువాక ప్రాంతంలో శిష్ట కరణ సంఘం అభివృద్ధికి, సామాజికవర్గ ఐక్యతకు తాము చేస్తున్న కృషిని వారు వివరించారు. అనంతరం జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, తెలంగాణ బీసీ కమిషన్ అధ్యక్షుడు వకులాపురం కృష్ణ మోహన్, శిష్టకరణ సంఘం జాతీయ అధ్యక్షుడు డి.వి.కృష్ణారావు తదితరులు వారిని సత్కరించారు.

వికేంద్రీకరణతోనే సుపరిపాలన సాధ్యం



మాట్లాడుతున్న ఆచార్య వి.బాలమోహన్‌దాస్

ఏయూ క్యాంపస్: మార్చి నెలలో విశాఖ వేదికగా నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ రాష్ట్రంలో పారిశ్రామిగ పురోగాభివృద్ధికి దోహద పడుతుందని మాజీ వీసీ డా వి.బాలమోహన్‌దాస్ అన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్ డాక్టర్ వైఎస్ఆర్ మేధావుల ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అధ్యక్షతన ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగంలో ×సుపరిపాలనలో యవత పాత్ర×పై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ పయనిస్తుందని, ఇది పరిపాలన వికేంద్రీకరణతోనే సాధ్యమన్నారు. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయం స్వాగతించాల్సిన విషయమని చెప్పారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ తిమ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రజల జీవన ప్రమాణాలు, పెరగడం, ఆనందకర జీవనం సాగించడమే నిజమైన అభివృద్ధి అని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. యువత ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకుని ప్రతిస్పందించి సుపరిపాలనలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకటరావు, ప్రొఫెసర్ డాక్టర్ పార్వతీశం, విద్యావేత్త ఎస్.అప్పలనారాయణ, ఉపాధ్యాయుడు వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నో ప్రెన్యూర్‌షిప్‌తో ఆత్మనిర్భర్ భారత్ సాకారం



సదస్సులో పాల్గొన్న వక్తలు

ఏయూ క్యాంపస్: టెక్నో ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధితో ఆత్మ నిర్భర్ భారత్ సాకారం అవుతుందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏయూ డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సదస్సును డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీస్ విశాఖపట్నం కేంద్ర ప్రధాన అధికారి ఆర్.ఎల్.నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ యువతను టెక్నో ప్రెన్యూర్ అవకాశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఐపీ ఇన్నోవేషన్, స్టార్టప్ రంగాలలో యువతను మలచాల్సిన ప్రాధాన్యత వివరించారు. దేశంలో ఆవిష్కరణ కేంద్రంగా విశాఖ నగరం నిలుస్తుందన్నారు. శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త ఆచార్య హెచ్.పురుషోత్తం మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అతిపెద్ద ఐపీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వ్యవస్థను నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఎస్ఐ–ఎంఎస్ఎంఈ సీనియర్ ఫ్యాకల్టీ జి.సుదర్శన్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, డాక్టర్ అనింద్య రాయ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, వాడచీపురుపల్లి పంచాయతీ, ఊటగడ్డపాలెం గ్రామ కాపురస్తులు అయిన కుంద్రపు సన్యాసిరావు గారి కుమారుడు కుంద్రపు నరసింగరావు నాకు ఇచ్చిన సూచనల మేరకు ఈ పబ్లిక్ నోటీసును ఇవ్వడమైనది.

నా క్లయింటు అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో GR.No.777/07-02-2023 in O.S.2023 నెంబరు గల దావాను శ్రీమతి కుంద్రపు శ్రీదేవి, శ్రీమతి కుంద్రపు జయ, సత్య సాయిరాం పాత్రో, తిక్కాడ నరసింగరావు మరియు తిక్కాడ చంద్రమ్మ పై దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తి పై Specific performance of contract నిమిత్తం దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మా క్లయింటు దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తిలను ఎటువంటి అమ్మకములు జరుపరాదని కోరుతూ I.A. ను కూడా దాఖలు చేసి ఉన్నారు. కాగా సదరు దావా మరియు I.A. లు పెండింగ్ లో ఉన్నవి. కాగా పైన ఉదహరించిన శ్రీమతి కుంద్రపు శ్రీదేవి వగైరాలు దావా విషయం మరుగుపెట్టి క్రింద ఆస్తిని ఇతరులకు అమ్మ జూపుతున్నట్లు నా క్లయింటుకు తెలిసినది. అట్లు చేయుటకు వారికి హక్కు లేదు. కావున ఎవ్వరును పై వ్యక్తులు అనగా దావాలో ప్రతివాదులు అయిన శ్రీమతి కుంద్రపు శ్రీదేవి వగైరాల తో ఎటువంటి లావాదేవీలు షెడ్యూల్ ఆస్తి నిమిత్తమై చేయరాదని, చేసినను చెల్లనేరవని, అంతియే గాక నా క్లయింట్లు గైకొనే చర్యలకు బాధ్యులు అగుదురు అని ఈ నోటీసు ద్వారా యావన్మందికి తెలియపరచడమైనది.

SCHEDULE PROPERTY

Anakapalle District - Anakapalle Registration District - Lankelapalem Sub-registry - Parawada Mandal - Naidupalem Gramapanchayat - Cheepurupalli East Khandam Village - Dry Land of an extent of Ac. 1-00 cents out of Ac. 1-45 cents in S.No.263/3 and bounded by : **East** : Land of Kundrapu Appalanaidu, **West & South** : Lands of Konda Chandrayya and Konda Apparao, **North** : Land of Cheepurupalli Mutyalu Etc.

LANKA JAGANNADHAM,
LANKA PARVATEESAR
Advocates
Anakapalle - 531 001, A.P.
Cell : 9885161002

అనకాపల్లి
తే:12-02-2023 దీ.

19న సహజ యోగం సాధన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

బీచ్ రోడ్డు: ఒత్తిడిని జయించి, మానసిక ప్రశాంతత పొందేందుకు ప్రతి ఒక్కరూ సహజ యోగా సాధన చేయాలని కలెక్టర్ మల్లికార్జున సూచించారు. ఏయూలో ఈ నెల 19న నిర్వహించనున్న సహజ యోగం..నేటి మహాయోగం కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ నిరంతరం వివిధ రకాల ఒత్తిళ్లతో సతమతమవుతున్నారని, వాటి నుంచి ఉపశమనం కోసం సహజ యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహజ యోగా నేటి మహా యోగం కార్యక్రమ ప్రతినిధులు మధుసూదన్, కెప్టెన్ బాబూరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.